నా లాటరీ మోటారు

పెద్దాడ రాజలింగమూర్తి, బి. ఏ.,

౧

లాటరీ అంటే నాకు చిన్నప్పటినుంచీ తల నొప్పి పరమాసహ్యమూను. లాటరీవేయడ మంటే ఏదో పాపంచేసినట్టుగా మనసు చివుక్కు మంటుంది. లాటరీ రాలేదంటే టిక్కెట్టుకు వెచ్చించినడబ్బు-న్యాయమైనది- వృధా అయిందికదా అనిన్నీ, నిరుపేదలకు దానంచేస్తే కొంతపుణ్యమైనా వచ్చి వుండేది అనిన్నీ. లాటరీ గెల్చేటట్టయితే అన్యాయంగా, అనాయాసంగా అన్యులధనం మనకు ప్రాప్తించింది, ఇతరులప్రాణము లెంతవుసూరుమన్నవో యిందువల్ల మనం అక్కరకు వస్తామా అనిన్నీ ఆందోళన అంకురిస్తుంది. అందుచే చిన్నప్పటినుంచీ లాటరీవేయడ మంటే అకార్యంగా అనుకునేవాణ్ణి.

౨

రాత్రి పెందలకడనే భోజనంచేసి పండు వెన్నెట్లో 'యీజీ ఛైరు' లో పగలల్లా వ్రాయగా మిగిలిన ఆఫీసుకాగితాలను వ్రాసుకుంటూ కూర్చున్నాను. సమీపంలో మంచంమీద మాచిట్టి సుఖంగా నిద్రబోతూంది. భోజనానంతరం చేసికోవలసిన గృహకృత్యాలు నిర్వర్తించుకొని వేగిరంగా మా కల్యాణి కూడా అక్కడికేవచ్చింది. కల్యాణి తన ఒడిలోనున్న మల్లెపూలను మాలగా గుచ్చుకొంటూ కుర్చీకి మంచానికీ మధ్యగాకూర్చుంది. కల్యాణిచేతిలోని మల్లెపూలు ముఖబింబమున తాండవించు లేనవ్వులు, వెన్నెలలో నైక్యమౌతూ నూతనశోభ కలిగించాయి.

"రాత్రిపగలు ఆఫీసుపనేకాని అన్యం అక్కర లేదా?" అంటూ కల్యాణి నాముఖంకేసి చూచింది.

వెంటనే జవాబుచెప్పటకు నాకేమీ తోచింది కాదు. ఆడాళ్లకు మగవాళ్ల కష్టసుఖా లెట్లు తెలుస్తాయి? తాలూకాగుమాస్తా చేయవలసివుండే విధులు చేసేవారికేగాని తెలియవు. చేసినకొలదీ పనికి అంతుండదు. చేసినదానికి మెప్పుండదు. ఒక డిప్యూటీ కలెక్టరు కూతురు తనభర్తపై కోపంవచ్చినప్పుడు "నా తండ్రితో చెప్పి మీకు తాలూకాగుమాస్తాపని వేయిస్తా"నని బెదరించుచుండేదట! తాలూకాగుమాస్తా పడే కష్టాలు అనుభవైకవేద్యము, వర్ణనాతీతము.

దైవానుగ్రహంకొలదీ, ఆనర్సు పేసయినాననే కారణంచేతనో, డిప్యూటీ కలెక్టరుగారి అల్లుడననే కారణంచేతనో, నాకు ప్రథమంలోనే 'ప్రొబేషనరీ రెవిన్యూ యినస్పెక్టరు' పని లభించి నాలుగేండ్లలోనే యేబది రూపాయిల జీతంలోనికి వచ్చాను. తక్కిన గుమాస్తాలకంటె చాలాశ్రమ నాకు తప్పింది. ప్రొబేషనరునని మా ఆఫీసులో మా అధికార్లకు నాయందు కొంత గౌరవ ముండడంమూలాన్నికూడా నాకు తక్కువపని కల్పించారు. ఏది యెట్లావున్నా రాత్రిళ్లు యింటివద్ద ఆఫీసుపని చేసుగుంటే కాని arrears లేకుండా నిర్వహించడం దుర్ఘటం. ఈ సంగతి మా కల్యాణికికూడా కొంతవరకు తెలుసును. కల్యాణి యిప్పుడు వేసినప్రశ్న ఇదివరలో చాలామారులు వేసినదే. ఆ ప్రశ్నకు ఒక నవ్వే నా సమాధానం. ఆ నవ్వులో నా అసమర్థత, అసహాయత, అనాదరణ మిళితమైవుంటాయి.

కల్యాణిప్రశ్నకు మామూలునవ్వే సమాధానంగా ఉపయోగించాను. కాని కల్యాణి యీనాడానవ్వుతో తృప్తిపడ లేదు.

"నామాటకు సమాధానం లేదు, మీ ధోరణి మీదేనా?" అంటూ కల్యాణి నా సమీపంలోవున్న దీపం తగ్గించేసింది. ఇతరపరిస్థితుల్లో కల్యాణి చేసిన నేరమునకు తగినశిక్ష విధించేవాణ్ణే. కాని అప్పట్లో ఏమిచేయడానికీ తోచక, నా అసమర్థత వెలికితోచనీయక "ఎప్పుడూ యీలాంటి అల్లరిపనే" అని అంటూ చిరునవ్వు తెచ్చుకొని కల్యాణిచెక్కులను

నొక్కి ముద్దాడాను. కల్యాణి విజయమునకు విఱ్ఱవీగుచు "మోటసరసము" అని అస్పష్టవాక్యములతో ఆనందించింది.

ఆఫీసుకాగితము లందొకచోట పొందుపరచి ఆనందమును వెదజల్లుచు పిండియారబోసినట్లుండిన బ్రహ్మాండమునంతను కండ్లారగాంచుచు తన్మయులమైనాము.

3

"బొంబాయిలో లాటరీయట! మీరు విన్నారా?" అని కల్యాణి ప్రశ్నించింది.

"బొంబాయియందేమి, దేశమెక్కడ చూచినా లాటరీలే!" అంటూ విసుగుచూచించాను.

వెంటనే దుమారం రేగింది. లాటరీలు వేయకూడదని చిరకాలం నుండి నా మనసులో ఖాయపడియున్న దృఢాభిప్రాయాలు వెలిబుచ్చి కల్యాణిని నా పక్షానికి మరల్చడంకు యత్నంచేశాను. సాధ్యంకాలేదు. ఆమె విద్యావతి. మరల్పరాని ఆశయములు కలది. కీ. శే. తన తండ్రివలెనే తాబట్టిన కుందేటికి మూడేకాళ్లని అనే స్వభావంకలది. ఏదోవిధంగా రాజీచేసుకొనక తప్పదని ఆమెఆశయములకే నేను సంపూర్ణాంగీకారము చూపవలసివచ్చింది.

దరహాసవదనంతో ఆమె "మీరు నాతప్పు క్షమిస్తారన్నమాట!" అనిఅంది.

"ఏంతప్పు"?

"రాత్రి పగలు ఆఫీసుపనేకాని అన్యం అక్కర లేదా?"

"బొంబాయి మోటారులాటరీకి అయిదు రూపాయిలుపెట్టి మీపేర టిక్కట్టుకొన్నాను—మధ్యాహ్నం మీరు కచ్చేరీకి వెళ్లింతర్వాత" అని అంది కల్యాణి.

నామనస్సులో కోపం ఒక్కుమ్మడి పెల్లుబికింది. "ఆడవాళ్లకు ధనముయొక్క విలువతెలియదు. ఎంత

నిర్లక్ష్యము! ముప్పదిరోజులు కష్టించి పనిచేయగా యీాకరువురోజుల్లో Salary cut పోగా వచ్చే స్వల్పజీతంలోని అయిదురూపాయిలను వృథాగా మంటి

అంటూ కల్యాణి నాముఖం కేసి చూచింది.

పాలుచేసిందే!" అని విషాదం మనసును కలచివైచింది. కాని యింతలో మాచిట్టి 'బాబా-బాబా' అనిపలవరించింది. చిట్టిపెదవులపై తేలియాడిన చిరునవ్వులున్నూ సన్నని పండ్ల ధవళచ్ఛాయలున్నూ చంద్రరేఖను వెక్కిరించినట్లు మెరిసినాయి. నిద్రించు మాచిట్టిముఖబింబమున తాండవించు నిర్మలమందహాసవీచికలు నాహృదయాందోళనము చల్లార్చి సేదతీర్చినవి.

"మంచిపని చేసితివి, సంతోషము" అని అప్రయత్నముగా కల్యాణిచేసిన కార్యమునకామె నభినందించాను.

తలవనితలంపుగా కల్యాణి పొందిన గౌరవమునకు ఆమె ఆహ్లాదమందింది.

౪

పదునైదుదినములు గడచినవి.

సాయంకాలము మూడుగంటలైనది. ఆఫీసులో తహశీలుదారుగారు నాచే తయారుచేయబడినఆఫీసులెక్కలను పరీక్షించుచుండిరి. ఇంతలో తపాలా బంట్రోతు తంతినొకటి గొనివచ్చి నాకిచ్చెను. తంతిని నేనిప్పుకుండగనే "పాపము! ఆపుత్రులలో నెవరికైనా ప్రమాదము కలుగలేదుకదా!" అని తహశీలు దారుగారు ప్రస్తావించారు. తోడిగుమాస్తాలందరూ చుట్టూచేరారు. తంతివిచ్చి "లాటరీవచ్చింది. బొంబాయిమోటారులాటరీ గెల్చాను" అని అప్రయత్నంగా ఆనందాందోళనలతో అధికారి సముక్షమందున్న సంగతికూడా మరిచి అరిచాను. అక్కడ నేను పొందిన అభినందనములకు అంతులేదు. తహశీలుదారుగారు కూడా ఆ రోజుకు తణిఖీ ఆపుచేసి యింటికేగుట కనుమతినిచ్చారు. నాతోడి గుమాస్తాలు అప్పట్లో నాజేబులోనున్న పదిరూపాయిలు వెచ్చించి నా అనుమతిలేకుండానే 'టీపార్టీ' చేసికొని ఆనందించారు. వార్త తెచ్చిన తంతి జవానుకున్నూ, ఆఫీసుజవానులకున్నూ బహుమానాలక్రింద తాలూకా షరాబు అయిదు రూపాయీలు అప్పుకూడా పెట్టాడు.

౫

కల్యాణిఆనందమునకు మేరలేదు. అప్రయత్నంగా వాహనాధికారం కలిగిందికదా అని ఆమె సగర్వి అయింది. మోటారుకారుకెవరిది అని ప్రణయకలహం ప్రారంభమయింది.

"నాజీతపు రాళ్లతో కొన్న టిక్కట్టుకదా, మోటారు నాదే" నని నేనన్నాను.

"టిక్కట్టు కొన్నది నేను. కావలిస్తే అయిదు రూపాయీలు యిచ్చేస్తాను. కారుమాత్రం నాదే" అంది కల్యాణి.

మాకు సమాధానం కుదరక మాచిట్టిని తగాదా పరిష్కరించేందుకు న్యాయాధికారిగా కోరుకున్నాము.

"చిట్టీ, చిట్టీ, కా రెవరిదమ్మా?" అని అడిగాము.

"నాదే!" అంది మాచిట్టి వచ్చీరానిమాటలతో.

చిన్నప్పుడు చదువుకున్న రెండుపిల్లులతగాదా కోతి తీర్చినకథ జ్ఞాపకంవచ్చి మేమిద్దరం నవ్వుకున్నాం.

"కారు నీదేనమ్మా!" అంటూ చిట్టిని ఉభయులమూ ముద్దాడాము.

మరునాడు రెండువేలురూపాయి లిచ్చేదమనిన్నీ, కారు విక్రయించవలసిందనిన్నీ ఒక యేజంటు తంతి నిచ్చాడు. కారు పంపుచున్నానని లాటరీయజమాని తంతినిచ్చాడు. యీ రెండువార్తలను చూచినపిమ్మట కళ్లు తెరిచాను.

కారా? రెండువేలరూపాయిలా??

యిదమిద్ధమని నిర్ణయించలేక Shakespeare పడ్డ అవస్థలోపడ్డాను.

తోడిసమస్తాలందరూ "తాలూకాసమస్తాకు కారెందుకు? రెండువేలూ పుచ్చుకొని బ్యాంకులో వడ్డీకి వేసుగో" మన్నారు.

కల్యాణి కీపద్ధతి నచ్చలేదు.

"ఈ అపశకునపుమాట లేమిటి? వచ్చిన కారు అమ్ముకుంటారా? శిరివస్తూంటే మోకాలడ్డుతారా? అయిదువేలరూపాయిల కిమ్మతుచేసే కారు రెండువేలకా అమ్ముకోవడం? కావాలన్నప్పుడు కారు దొరుకుతుందా? కారే వుంచుకోవాలి" అంటూ ఆమె గట్టి ఉపన్యాసం యిచ్చింది. ఆమె బాల్యంలో తండ్రి డిప్యూటీకలెక్టరు చేసేటప్పుడు కారుసౌఖ్యం అనుభవించింది. తండ్రి చనిపోవుటచేతనున్నూ, పుట్టింటివారి కుటుంబము చితికిపోవుటచేతనున్నూ ఆమెసౌఖ్యంకు విఘాతం కలిగింది. తిరిగి అట్టిసౌఖ్యం తనంతటతానే వెదకికొని వచ్చుచుండగా పోద్రోచుట కామె కిష్టము లేదు. ఆమెయాజ్ఞ యెప్పటివలె శిరసావహించాను. కారు స్టేషనుకురాగానే రైల్వేవారి కీయవలసిన ఖర్చు ఏబదిరూపాయిలు నాజీతం రానందున హెడ్‌క్వార్టర్సు రెవిన్యూయినస్పెక్టరుగారివద్ద చేబదులు తెచ్చి చెల్లించి కారుయింటికి తెప్పించుకున్నాను. కారు క్రొత్త Model ది. నూతనంగా యింగ్లాండునుంచి దిగుమతి చేయబడింది. ఆ Model కారు చూచినవాళ్లంతా బాగుందని వేనోళ్ల పొగిడారు. మాయిల్లొక తీర్థయాత్రాప్రదేశమైంది. వచ్చి చూచేవా రడిగేప్రశ్నలకు సమాధానం చెప్పలేక విసిగిపోయాను.

కల్యాణి పొందిన ఆనందము వర్ణింపశక్యంకాదు. వచ్చిపోయే అమ్మలక్కలందరకు ఆకారుయొక్క చరిత్ర నామూలాగ్రంగా సుమారు వేయిమార్లయినా వర్ణించియుంటుంది. కారులోనే గాక యివతల కూర్చొబెడితే యేడ్పుప్రారంభించేది మాచిట్టి.

కారునకు ఒకషెడ్ వేయించవలసిందని అంతా సలహాయిచ్చారు. అందుకోసం మాయింటికెదురుగా వున్న కాళీదొడ్డి అద్దెకుతీసుకొని అరవై రూపాయిలు ఖర్చుపెట్టి వకరేకుషెడ్డు వేయించాను. డ్రైవింగు తరిఫీదుపొందిన గ్రామంలోని నిరుద్యోగులందరూ ఉద్యోగం నిమిత్తం అప్లికేషనులు పంపడం ప్రారంభించారు. సమయాసమయాల్లేకుండా వేపించుకు తిన్నారు. గ్రామంలో అందరిదగ్గరనుంచీ స్నేహితులేమి, బంధువులేమి, పరిచయులేమి, అధికార్లేమీ, అందరిదగ్గరనుంచీ రెకమెండేషన్సు తీసుకురావడం ప్రారంభించారు. ఆఖరికి మా తహశీలుదారుగారుకూడా కులాభిమానాన్ని పురస్కరించుకొని ఒకడిని రికమెండు చేశారు. ఆతగాణ్ణి కాదంటే, నా ఉద్యోగానికి భంగ

మొస్తుందేమోనని నెలకు పదిహేనురూపాయిల జీతం మీద అతణ్ణే డ్రైవరుగా అప్పాయింటు చేసినాను. ఉద్యోగాలను భర్తీచేసే అధికారం వున్నవారిపాట్లు నాకప్పుడు గోచరించాయి

౭

మ్యునిసిపాలిటీవారి దగ్గరనుంచీ, జిల్లాబోర్డువారి దగ్గరనుంచీ మోటారు లైసెన్సు ఫీజులు చెల్లించవలసిందనిన్నీ, లేనియెడల ప్రాసిక్యూషను చేస్తామనిన్నీ శ్రీముఖాలు వచ్చాయి. డబ్బు సర్దుబాటుచేసుకోలేక చాలా చిక్కులుపడ్డాను. కల్యాణి నాకష్టం కనిపెట్టియేమనడానికి తోచక తనవడ్డాణం విక్రయించి సొమ్ము సకాలంలో సర్దింది.

మా డ్రైవరు కొద్దిరోజుల్లోనే మాకు యజమాని కావటం ప్రారంభించాడు. తన్ను "నాయుడు" అని పిలిస్తేనేకాని పలకనని నాకు వినబడేటట్టు యితరుల వద్ద అంటూవచ్చాడు. అవిధేయత, అవిశ్వాసం వృద్ధి కావడం మొదలెట్టాయి. పెట్రోలుకు అయ్యేఖర్చు మితిమీరింది. కారు మరమ్మతుల పేర వసూలుచేసిన మొత్తం పెరిగిపోయింది. ఇదేమనడానికి భయం. తాను తహశీలుదారుతరఫుమనిషి నిగడా అని పొందిన అహంకారము హద్దుమీరింది. తగినట్లు మందలిద్దామంటే తహశీలుదారుగారి కోపానలంలో ఆహుతి కావలసివస్తుందేమోనని లోపల నాకు భయం.

కారు వచ్చింతరువాత నాకు కష్టపరంపర లెక్కువైనాయి. మనశ్శాంతికి దేహశాంతికి కూడా భంగము వాటిల్లింది. నాకు వచ్చే నెలజీతంతో సుఖంగా జీవయాత్రగడపే సంసారమునకు ఇప్పుడు నూటయేబది రూపాయలవరకు ఖర్చు పెరిగింది. ప్రస్తుత ఆర్థికపరిస్థితులనుబట్టి అప్పుకూడా పుట్టడం మానేసింది. మోటారు ఏజంటుయిస్తానన్న రెండువేలరూపాయిలు పుచ్చుగుంటే బాగుండియుండేదని కల్యాణి ఒకటిరెండుసార్లంది. నాకష్టసుఖాలలో పాలుపొందే కల్యాణి తనవేయి రూపాయిల కిమ్మతుగల నగలను కుటుంబఖర్చు క్రిందే వినియోగించింది. కుటుంబఖర్చు నిమిత్తం మారువాడీకి అయిదువందల రూపాయిలు ఋణపడ్డాను.

కారు వచ్చినపిమ్మట లోకులుకూడా విరోధులు కావడం మొదలెట్టారు. "కారువచ్చా"క గర్వంవచ్చింది రావిడికి అంటూకొందరు, "దీనితో వీడిదీపం ఆరిపోతుం"దని కొందరు, "కోతికి కొబ్బరికాయ దొరికిన విధంగా కులుకుతున్నారు మగడూ పెండ్లాము" అంటూ కొందరు, నిర్నిమిత్తంగా అసూయాపరు లనడం సాగించారు. గ్రామంలో అవసరమున్నవాళ్లూ లేనివాళ్లూ కూడా కారొకమారు lend చేయమంటూండేవాళ్లు. ఇస్తేవకతంటూ, ఈయకపోతే వకతంటూ. నిరంతరము నాకారు తమస్వంతకారుగా వినియోగించుకొనుచుండిన మాతహశీలుదారు హెడ్డు అక్కవుంటెంటుగార్లకు కూడా నేను అప్రియుడనై పోయాను.

మా డ్రైవరు చేసిన దుర్ణయము లొక్కటొకటిగా బయలుపడ్డాయి. నా పేర పెట్రోలుకొని యెప్పటికప్పుడు తిర్గి యితరులకు విక్రయించి సొమ్ముహరించేవాడు. రిపేర్సు పేరెట్టి నావద్ద వసూలుచేసిన సొమ్ముంతయు తనకే జమకట్టుకునేవాడు. కారుసామానులు కొన్నిమార్చి లాభంచేసుకున్నాడు. ఒకరోజు సాయింత్రం మాచిట్టి కారులోకూర్చొని ఆడుకుంటూండగా మెళ్లోవున్న బంగారుగొలుసు తీయడానికి ప్రయత్నించాడని యిరుగుపొరుగువారు మాకల్యాణితో చెప్పారు. ఈసంగతులన్నీ విమర్శించి డ్రైవరును నౌఖరీలోంచి తగ్గించి తహశీలుదారుగారి భయాన్ని ఛార్జి యివ్వకుండా వదిలేశాను. కారు నేనే నడపడం ప్రారంభించాను.

౮

సాయంత్రం అయిదుగంటలయింది. చల్లగాలికి షికారు కెడదామని కల్యాణిఅంది. ఆదివారమవడంచేత, అర్జంటు ఆఫీసుపని లేకపోవడంచేత నేనందుకు "సరే" నన్నాను. కారుమీద ప్రయాణమైనాము. కారు వేగంగా పోతూంది దారి నిర్మానుష్యమవడంచేత. కొంత దూరం పోయేసరికి రోడ్డుపైనున్న మామిడిచెట్టు

పైకెక్కి కాయలుకోసుకుని యొకకుర్రవాడు రోడ్డుమధ్యకు దుమికాడు. పాప మాతడు కారువస్తూవున్న సంగతి చూడనే లేదు. కారువేగంవల్లనూ, వ్యవధి లేనందువల్లనూ ఏమి చేయుటకూ నాకు తోచలేదు. ఎట్లో బ్రేకుమాత్రం వెంటనే వేశాను. పదిగజములు పరుగెత్తి కారు గమన మాగింది. రోడ్డుపైనున్న బాలుడు తబ్బిబ్బయినాడు. కారు చక్ర మాతనికాలిపైనుండి పోయింది. ఈ దృశ్యం చూచి కల్యాణీ చిట్టీకూడా హాహాకారాలు చేశారు. ఆయువకుడి కుడికాలి యెముక విరిగింది. స్పృహకూడా కొంచెము తప్పింది. కారులోనే వైద్యాలయంకు తీసుకొనివచ్చి సకాలంలో తగినచికిత్స చేయించాను. పోలీసువారికికూడా సమాచారం తెలియపరిచాను. పడరాని పాట్లువడి, పట్టరానివాళ్ల కాళ్లుపట్టి, బోలెడు ధనం వెచ్చించి కేసు లేకుండా మాపు చేయించుకునేటప్పటికి తలప్రాణాలు తోకకు వచ్చాయి.

మాడ్రైవరు కృతఘ్నుడని యిదివరలోనే చెప్పాను. వాడికి నేను చేసిన మేలుకు బదులు వాడు నాపై ద్వేషము పెంచి మార్వాడీచేత నా మీద దావాచేయించి నా కారు జప్తుచేయించాడు. కోర్టువేలంలో మార్వాడీయే నా కారు తనబాకీ క్రింద పాడుకున్నాడు. నాకేమిచేయుటకును దోచలేదు. దుఃఖము వెల్లువలై పారింది. క్రొత్తనీరువచ్చి పాతనీరును గొనిపోయినట్లు యీకారువచ్చి మనలను దరిద్రులను చేసిపోయింది అంటూ వేడికన్నీరు కార్చాను.

"మీదుఃఖమునకు బాధ్యురాలను నేనే" అంటూ కల్యాణి నన్నూరడించింది.

"చిన్ని లేడినికోరి
సీతమ్మ తెచ్చింది
శ్రీరామునకు కష్టమూ
శ్రీరామునకు కష్టమూ"

అని యెవరో పాడుకుంటూండగా విన్న పాద మాలాపిస్తూ చిట్టి మావద్దకు పరుగెత్తుకుంటూ వచ్చింది.